సాక్షి బాపట్ల

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

శలపాడు (చేబ్రోలు): శలపాడులో ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ మన్నెం శిరీష పాల్గొన్నారు.



స్టేషన్లలో జిల్లా ఎస్పీ తనిఖీ

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం, అరండల్‌పేట పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం తనిఖీ చేశారు.



దుర్గమ్మ సేవలో త్రివిక్రమ్

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనక దుర్గమ్మను సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులను పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయమై ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్షకు స్పందన



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను నిర్వహించిన రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్షకు అనూహ్య స్పందన లభించిందని కో–ఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ తెలిపారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లుతో కలసి ఆదివారం ఆయన ఏఎన్‌యూలో పరీక్ష తీరును పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 10 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష సజావుగా జరిగినట్లు పేర్కొన్నారు. మొత్తం 720 మంది దరఖాస్తు చేసుకోగా 522 మంది హాజరయ్యారన్నారు. ఇందులో ఎంబీఏకు 449 మంది, ఎంసీఏకు 73 మంది పరీక్ష రాశారని తెలిపారు. ఎంబీఏలో ఇప్పటికే ఉన్న స్పెషలైజేషన్‌తో పాటు నూతనంగా ఎంబీఏ ఫైనాన్స్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని పలువురు విద్యార్థులు కోరినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షల ప్రత్యేక పరిశీలకులుగా కె. శ్రీధర్, ఎన్. బాబు వ్యవహరించారు. ఫలితాలు సోమవారం సాయంత్రం విడుదల అవుతాయని పరీక్షల కో–ఆర్డినేటర్ దిట్టకవి రామచంద్రన్ తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 6,834 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,834 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగులు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 140 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,685, క్యూసెక్కులు, తూర్పు కాలువకు 607, పశ్చిమ కాలువకు 247, నిజాపట్నం కాలువకు 436, కొమ్మూరు కాలువకు 2,980 క్యూసెక్కులు, బ్యారేజి నుంచి సముద్రంలోకి 2,17,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

24 నుంచి డ్రెయిన్స్‌పై ఆక్రమణల తొలగింపు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరంలో ఈనెల 24వ తేదీ నుంచి రోడ్లు, డ్రెయిన్స్ మీదకు వచ్చిన ర్యాంపులు, మెట్ల తొలగింపు ప్రక్రియ చేపడతామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో వర్షం పడిన ప్రతిసారి పలు ప్రాంతాలు మునిగిపోవడంతో ఆదివారం సాక్షి దినపత్రికలో 'గుంటూరు నెత్తిన నీటి కత్తి' అనే కథనం ప్రచురితమైంది. దీనికి కమిషనర్ పై విధంగా స్పందించారు. నగరంలో గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల పలు ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు. రోడ్లమీద పడిన వర్షం డ్రెయిన్‌లలోకి వెళ్లడానికి వీల్లేకుండా ర్యాంపులు, మెట్లు ఏర్పాటు చేయడం వల్లనే ఈ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా స్వచ్ఛందంగా తొలగించుకోమని చెప్పినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. దీనివల్ల చిన్నపాటి వర్షాలకు కూడా నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. డ్రెయిన్లను మూసేస్తూ ఏర్పాటు చేసిన ర్యాంపులు, మెట్లను మంగళవారం సాయంత్రం లోపు తొలగించుకోవాలని, లేనిపక్షంలో బుధవారం ఉదయం నుంచి నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బంది వార్డుల వారీగా జేసీబీలతో తొలగింపు ప్రక్రియ చేపడతారని తెలిపారు. జరిగిన నష్టానికి సంబంధిత నిర్మాణదారులే బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.

అక్షరమే ఆయుధం



అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రభుత్వం



ప్రజా ప్రయోజనాలతో వార్తలు ప్రచురించినప్పుడు అధికార పార్టీకి మద్దతుగా లేకపోతే సంబంధిత విలేకరులపై కేసులు పెట్టడం అధికార దుర్వినియోగం అవుతుంది. ప్రజా ప్రయోజనాలతో ఎలాంటి వార్తలనైనా ప్రచురించే హక్కు పత్రికలకు ఉంటుంది. అలాంటి స్వేచ్ఛను అణచివేయడం దారుణమైన విషయం. విలేకరులపై కేసులు పెట్టడం, వారి కుటుంబాలను వేధించడం ఏ ప్రభుత్వానికైనా సరైన పద్ధతి కాదు. పత్రికా స్వేచ్ఛను అడ్డుకునే అధికారాన్ని రాజ్యాంగం ఎవరికీ కట్టబెట్టలేదు. స్వాతంత్ర్య పోరాటానికి ముందు నుంచి గళమెత్తిన పత్రికలు.. ఎన్నో అన్యాయాలను ఎదిరించి రాశాయి. అధికారాలను మార్చాయి. విలేకరులపై తప్పుడు కేసులు పెట్టే సంస్కృతిని ఎవరైనా ఖండించాల్సిందే.

– మెరుగుపాల రాజారత్నం, సీనియర్ జర్నలిస్ట్

విమర్శలకూ భయపడుతున్న కూటమి సర్కార్



ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిపై కేసులు పెట్టడం తొలిసారిగా కూటమి పాలనలోనే చూస్తున్నాం. గతంలో ఎక్కడా చూడలేదు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వం.. ఎవరైనా విమర్శిస్తే చాలు కేసులు పెడుతోంది. పత్రికలు విమర్శిస్తే చాలు కూటమి ప్రభుత్వం భయపడుతోంది. సాక్షి ఎడిటర్‌పై, విలేకరులపై ఇప్పటికైనా ప్రభుత్వం కక్షపూరిత కేసులు పెట్టడం మానుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. లేదంటే ప్రజలే తిరగబడి ప్రశ్నిస్తారు. ఈ విషయాన్ని అధికారంలోని పాలకులు, ఆయా పార్టీల కీలక నాయకులు గుర్తించుకోవాలి.

– బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు

అమ్మ కొండకు పండగొచ్చింది



- ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి దసరా మహోత్సవాలు
- నేడు బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం
- ఉదయం 8 గంటల తర్వాతే భక్తులకు దర్శన భాగ్యం
- ఈ ఏడాది దుర్గమ్మకు 11 అలంకారాలు

కాంతుల కనకధార.. విద్యుత్‌దీపాలంకరణలతో ధగధగలాడుతున్న ఇంద్రకీలాద్రి

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున 3 గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ
- తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం
- శ్రీబాలా త్రిపురసుందరీదేవిగా అలంకరణ, పూజా కార్యక్రమాలు, బాల భోగ సమర్పణ
- ఉదయం 8 గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం 9 గంటలకు కలశస్థాపన
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం
- ఉదయం 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- సాయంత్రం 4 గంటలకు శ్రీగంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవం
- సాయంత్రం 6 గంటలకు పంచ హారతుల సేవ
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం శ్రీ దేవీ శరన్నవరాత్రి (దసరా) మహోత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాల తొలి రోజైన సోమవారం శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం ఎనిమిది గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. తొలుత అమ్మవారి ప్రధాన ఆలయంలోని ఉత్సవమూర్తిని మహామండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకొస్తారు. అక్కడ ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాల నిర్వహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక కుంకుమార్చనలు, చండీయాగం, శ్రీచక్ర నవార్చనలు మొదలవుతాయి. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో సాయంత్రం వేళ అమ్మవారికి పంచహారతుల సేవ సమయంలో క్యూలైన్లు యథావిధిగా నడిపించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశతో పాటు దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు. అంతరాలయంలో పంచహారతులు జరుగుతుండగానే రూ.300, రూ.100 క్యూలైన్‌తో పాటు సర్వ దర్శనం క్యూలైన్లు నడుస్తూ ఉంటాయి. ఏర్పాట్లను దేవదాయ శాఖ, దుర్గగుడి అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదివారం మరో మారు తనిఖీ చేశారు.

2 హోల్డింగ్‌లు.. 5 క్యూలైన్లు

వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్న అధికార యంత్రాంగం సీతమ్మవారి పాదాల వద్ద, వీఎంసీ కార్యాలయం సమీపంలో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ రెండు హోల్డింగ్ పాయింట్లలో సుమారు 12వేల మంది భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఇక వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లకు చైనా వాల్ వద్ద మరో క్యూలైన్, ఓం టర్నింగ్ వద్ద మరో క్యూలైన్ కలిసి మొత్తంగా ఐదు క్యూలైన్లు ఆలయం వరకు కొనసాగుతాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ క్యూలైన్లలో అత్యవసరమైన సేవలతో పాటు అత్యవసర ద్వారాలను ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకుని మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకుంటారు.



11 అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం

ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో దుర్గమ్మ 11 విశేష అలంకారాల్లో భక్తులను కరుణించనున్నారు. తిథుల హెచ్చుతగ్గుల కారణంగా అలంకారాల్లో మార్పులు వస్తుంటాయని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. మొదటిగా శ్రీబాలా త్రిపుర సుందరీదేవి, రెండో అలంకారంగా శ్రీగాయత్రిదేవి, మూడో అలంకారంగా శ్రీఅన్నపూర్ణాదేవి, నాల్గో అలంకారంగా శ్రీకాత్యాయనిదేవి, ఐదో అలంకారంగా శ్రీమహాలక్ష్మీదేవి, ఆరో అలంకారంగా శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, ఏడో అలంకారంగా శ్రీమహాచండీదేవి, ఎనిమిదో అలంకారంగా శ్రీసరస్వతిదేవి, తొమ్మిదో అలంకారంలో శ్రీదుర్గాదేవి, పదో అలంకారంలో శ్రీ మహిషాసుర మర్దినీదేవి, పదకొండో అలంకారంలో శ్రీరాజరాజేశ్వరిగా అమ్మవారు దర్శనమిస్తారు. ఈ ఏడాది కాత్యాయని దేవి అలంకారం అదనం కావడంతో పండుగ 11 రోజులకు వచ్చింది.

నిరంతరం ప్రసాద వితరణ..

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కొండ దిగువన మహామండపం ఎదుట నూతన అన్నదాన భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలోనే ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని భక్తులకు అందజేస్తారు. ఒకే దఫా వెయ్యి మంది అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. ఇక క్యూలైన్‌లో చిన్నారుల కోసం పాలు, పెద్దల కోసం బిస్కెట్లు, మంచినీటి బాటిళ్లను అందజేయనున్నారు.



కీలకంగా మారనున్న కుమ్మరిపాలెం క్యూలైన్లు

ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో కుమ్మరిపాలెం క్యూలైన్లు కీలకం కానున్నాయి. గతంలో భవానీపురం వైపు నుంచి వచ్చే భక్తుల కోసం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి క్యూలైన్లు ప్రారంభమయ్యేవి. అయితే ఈ ఏడాది ఈ క్యూలైన్లలను కుమ్మరిపాలెం సెంటర్ వరకు ఏర్పాటు చేశారు. తెలంగాణ వైపు నుంచి వచ్చే భక్తులతో పాటు భవానీపురం, గట్టు వెనుక ప్రాంతం, సింగ్‌నగర్, వాంబే కాలనీ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కుమ్మరిపాలెం క్యూలైన్లే కొండపైకి చేరుకునేందుకు దగ్గర మార్గం అవుతాయి. అమ్మవారిని దర్శించుకున్న భక్తులందరూ మహామండపం, గోశాల, కనకదుర్గనగర్ మీదగానే బయటకు వెళ్లేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీపీ



దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నగర పోలీస్ శాఖ తరఫున సీపీ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు దుర్గమ్మకు పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన సీపీ రాజశేఖర్‌బాబు దంపతులను ఆలయ ఈవో శీనానాయక్ ఆలయ అర్చకులు, వేద పండితులు సాదరంగా స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.



ఘాట్ రోడ్డు ముఖద్వారం వద్ద సిద్ధమైన క్యూలైన్

న్యాయం చేస్తారా... నిందితుడిని అప్పగిస్తారా?

- ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులపైనా కేసు నమోదు చేయాలి
- ప్రత్తిపాడు పోలీస్ స్టేషను ఎదుట రావిపాటివారిపాలెం వాసుల ఆందోళన

ప్రత్తిపాడు: పసి పిల్లలపై నీచంగా, అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడిని కఠినంగా శిక్షించి 'మాకు న్యాయం చేస్తారా.. లేదా నిందితుడిని అప్పగిస్తారా ?' అంటూ మహిళలు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్ భర్త 72 ఏళ్ల వృద్ధుడు సామియేలు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. అతడి అరెస్టు విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ ఆదివారం రాత్రి రావిపాటివారిపాలెం గ్రామస్తులు పెద్ద ఎత్తున స్థానిక పోలీస్ స్టేషను వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. పాఠశాలకు సంబంధం లేని వ్యక్తిని నెలల తరబడి పాఠశాలలోనికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎలా అనుమతిస్తున్నారని మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, తప్పు చేసిన వారిని కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఎంఈవోతోపాటు హెచ్‌ఎం, ఉపాధ్యాయులపైనా వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు.



పోలీస్ స్టేషను ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఎస్‌ఐ నరహరి మాట్లాడుతూ నిందితుడిని ఆదివారం అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశామని, చట్టప్రకారం అతడిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు. మరలా రెండు నెలల్లో బయటకు వచ్చి తిరుగుతాడని, ఒక్కసారి మాకు అప్పగించాలని పట్టుబట్టారు. దీంతో ఎస్‌ఐ చట్టాన్ని చేతుల్లోనికి తీసుకోవడం సరికాదని తెలిపారు. బాధిత పిల్లల తల్లిదండ్రులు స్టేషనుకు వచ్చిన వెంటనే కేసు నమోదు చేశామని, ఎలాంటి తాత్సారం చేయలేదని ఎస్‌ఐ స్పష్టం చేశారు.

చట్ట ప్రకారం చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: నాగమ్మ భర్త విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

'బీచ్ ఫెస్టివల్'పై ముమ్మర ప్రచారం

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

బాపట్ల: బీచ్ ఫెస్టివల్‌కు ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా ప్రచార ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టరు వి.వినోద్ కుమార్ ఆదివారం పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 26 నుంచి 28 వ తేదీ వరకు సూర్యలంకలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌కు సంబంధించి సామాజిక మాధ్యమాలలో, ఇతర ప్రచార విధానాల గురించి ఆరా తీశారు. బాపట్ల జిల్లాలోని కాజు ప్రాసెసింగ్, ఆక్వా ఉత్పత్తులు, చీరాల చేనేత వస్త్ర తయారీ గురించి ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలని చెప్పారు. బీచ్ అందాలను, ఫెస్టివల్‌లో నిర్వహించే కార్యక్రమాల గురించి నిమిషం నిడివి కలిగిన వీడియోలు రూపొందించాలని సూచించారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ ప్రాంతాలు, ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ప్రచార స్టిక్కర్లను అతికించాలని తెలిపారు. ప్రచార కరపత్రాలను ముద్రించాలన్నారు. ఏర్పాట్లపై టూరిజం శాఖ సాంకేతిక అధికారులను అడిగి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ప్రముఖులకు, అధికారులకు, మీడియా వారికి పాసులు అందజేయాలన్నారు. హరిత రిసార్టును సుందరంగా తీర్చిదిద్దాలని మేనేజరును ఆదేశించారు. కార్యక్రమంలో టూరిజం అధికారి పద్మారాణి, ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఎస్‌ఈ ఈశ్వరయ్య, డీఈలు, ఏఈలు, ఏపీ టూరిజం అథారిటీ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పనులు త్వరగా పూర్తి చేయండి

సూర్యలంక బీచ్ ఫెస్టివల్ నిర్వహణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు ఫెస్టివల్ నిర్వహణకు విధులు కేటాయించిన అధికారులతో కలిసి ఆదివారం ఉదయం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ.. కేటాయించిన పనులను దగ్గర ఉండి సంబంధిత అధికారులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, డీపీఓ ప్రభాకరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, బాపట్ల, చీరాల ఆర్డీఓలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ లవన్న, వివిధ శాఖల అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.




తీరంలో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్

క్యాన్సర్‌కూ ఉంది ఆన్సర్

- బాధితులకు భరోసా
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం
- ఆధునిక చికిత్సలతో నివారణ
- నేడు వరల్డ్ రోజ్ డే

రోజ్ డే నేపథ్యం

కెనడా దేశానికి చెందిన 12 ఏళ్ల మెలిండా రోజ్ అనే బాలిక 1994లో క్యాన్సర్ వ్యాధికి గురైంది. అది కూడా చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్. కొన్ని వారాల్లోనే చనిపోతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కాని రోజ్ భయపడకుండా ఆస్పత్రిలో ఉన్న రోగులకు రోజా పువ్వులు అందించేది. వారికి కవితలు వినిపించి రోగుల్లో మనో ఉల్లాసాన్ని కలిగించేది. ఇలా ఆరునెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగులను చిరునవ్వుతో పలుకరిస్తూ ఉండేది. ఉత్తరాలు రాస్తూ వారిలో ఆనందం, ఉత్సాహాన్ని నింపుతూ సెప్టెంబరు 22న మరణించింది. ఆ బాలిక జ్ఞాపకార్థం ప్రతి ఏడాది రోజ్ డేను నిర్వహిస్తున్నారు.



గుంటూరు మెడికల్: క్యాన్సర్ .. ఈ వ్యాధి పేరు చెబితేనే చాలా మందికి ఒంట్లో వణుకు పుడుతుంది. వస్తే చనిపోవటమే అనే అపోహల్లో ప్రజలు ఉన్నారు. పూర్వ రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. బాధితుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 22న రోజ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

క్యాన్సర్‌కు కారణాలు

క్యాన్సర్ రావటానికి ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమే. సిగరెట్, బీడీ, చుట్ట , పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా.. ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా వస్తుంది. మద్యపానం, వ్యాయామం చేయకపోవడం, ఆకు కూరలు తినకపోవడం, ఊరగాయ పచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినడం, అధిక బరువు ఉండటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది.

జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు

సంవత్సరం	రోగుల సంఖ్య	ఆపరేషన్లు
2020	2067	-
2021	5,865	114
2022	13,107	395
2023	14,647	753
2024 ఆగస్టు వరకు	9,376	542


జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డు


పెట్‌స్కాన్ వైద్య పరికరం

జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య సేవలు

గుంటూరు జీజీహెచ్‌లో 2020 జులైలో అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కోట్ల రూపాయలతో పెట్ స్కాన్‌ను ఏర్పాటు చేశారు. 100 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌కు నేడు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇమ్యూనోథెరపీ, టార్గెట్‌థెరపీ ద్వారా త్వరగా కోలుకుంటున్నారు. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ టెస్ట్ ద్వారా చాలా త్వరగా గుర్తించవచ్చు. ఏ జీన్‌లో తేడా వల్ల సోకుతుందనే విషయం తేటతెల్లమవుతుంది. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతరులకు వచ్చే అవకాశం ఉందా లేదా నిర్ధారించే బీఆర్‌సీఏ-1, 2 పరీక్షలు ఉన్నాయి. లాప్రోస్కోపిక్, రొబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ ఎం.జి.నాగకిశోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

అన్నీ ఉచితమే..



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ. 45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటైంది. ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. రూ. కోట్లు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్, పెట్‌స్కాన్ వైద్య పరికరాలు ప్రభుత్వం అందజేసింది. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి సైతం ప్యాలేటివ్ కేర్ చికిత్సలు అందిస్తున్నాం. మందులు కూడా ఉచితంగా అందించి రోగుల్లో మనో ధైర్యం కల్పిస్తున్నాం. మరో వంద పడకలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మాణం చేస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్

స్క్రీనింగ్ పరీక్షలతో చెక్



స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా మహిళలు 45 సంవత్సరాలు దాటాక ప్రతి ఏడాది మ్యామో గ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. 55 సంవత్సరాలు దాటిన వారు సీ టీ స్కాన్, కొలనోస్కోపి చేయించుకోవాలి. తొమ్మిదేళ్ల నుంచి 11 ఏళ్లలోపు బాలికలకు, 45 సంవత్సరాల్లోపు మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. హెపటైటీస్ బీని కూడా వ్యాక్సిన్ వేయించుకుని రాకుండా నిరోధించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, మెడికల్ అంకాలజిస్ట్

క్లుప్తంగా

సూర్యలంకలో భద్రతా ఏర్పాట్లు పరిశీలన

బాపట్లటౌన్: బీచ్ ఫెస్టివల్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా ఈనెల 27న సూర్యలంక సముద్ర తీరానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్న నేపథ్యంలో తీరంలోని భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో బాపట్ల ఎస్‌బీ సీఐ జి.నారాయణ, బాపట్ల రూరల్ సీఐ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డివైడర్ మీదకు ఎక్కిన కంటైనర్

జె.పంగులూరు: డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో కంటైనర్ లారీ డివైడర్ పైకి ఎక్కిన సంఘటన మండల పరిధిలోని జాగర్లమూడివారి పాలెం వద్ద ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా బోయపాలెం నుంచి పొగాకు కంటైనర్ లారీ చెన్నై వెళుతోంది. మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెం ఫ్లైఓవర్ వద్దకు వచ్చే సమయంతో డ్రైవర్ సుత్తివేలు నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపు తప్పి డివైడర్ మీదకు ఎక్కింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద వివరాలు రేణింగవరం ఎస్సై, సిబ్బంది తెలియజేశారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేసినట్లు హైవే మొబైల్ సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని విరాట్ నగర్ సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ శివ నాగరాజు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని చెరువు కట్ట బజారుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చల్లా రాజేష్(22) టిఫిన్ తీసుకొని వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. రోడ్డు తడిగా ఉండటంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావటంతో రాజేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడు రాజేష్ తల్లి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు.

జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు



నగరంపాలెం: స్థానిక నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆదివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను గుంటూరు జిల్లా జైళ్ల శాఖ, రవాణా శాఖ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి, మొక్కలు, పూలబోకేను అందించారు. పోలీస్, రవాణా, జైళ్ల శాఖ సమన్వయంతో పని చేద్దామని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా ఎస్పీని కలిసిన వారిలో ఉప రవాణా కమిషనర్ కె.సీతారామిరెడ్డి, ప్రాంతీయ రవాణాధికారి ఎ.శ్రీహరి, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏబీ.కాంతారాజు ఉన్నారు.

రేవేంద్రపాడులో వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికలు



దుగ్గిరాల: విద్యార్థులు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని అని హెచ్.ఎం బి.వి.కృష్ణారావు చెప్పారు. మండలంలోని రేవేంద్రపాడు జెడ్పీ హైస్కూలులో ఆదివారం జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో 17 నుంచి 19 సంవత్సరాల బాలబాలికల విభాగంలో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. విద్యార్థులు చురుగ్గా ఉండటానికి ఆటలు ఆడాలని, దేహ దారుఢ్యం కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు నాగ శిరీష, రాంబాబు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

99 అడుగుల మహాగణపతి కమిటీపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: తమలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకుని డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారని జిల్లా ఎస్పీకి కళాకారులు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుడు, శ్లోక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంట స్వామి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్ 99 అడుగుల మట్టి మహాగణపతిని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. నగరంలో ఉన్న వివిధ సాంస్కృతిక సంస్థలతో కలసి శ్లోకా ఫౌండేషన్ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు నిత్యం శాస్త్రీయ నృత్యాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఉత్సవాల అనంతరం కళాకారులకు సొమ్మును ఇవ్వకుండా కమిటీ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజానాయుడు, సెక్రటరీ లక్ష్మీరెడ్డిలు అందుబాటులో లేరని ఫిర్యాదు చేశారు. ఫోన్ ద్వారా కూడా సమాధానం చెప్పకుండా తప్పించుకొని వెళ్లి పోయారని ఆరోపించారు. కళాకారులు, చిన్నారులు, మహిళలు, మేకప్ మేన్‌కు రూ 1,75,000 ఇవ్వాలని తెలిపారు. వెంటనే నగదు ఇప్పించాలని స్వామి ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

108 వాహనం, బైక్ ఢీ : ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- ముళ్ల పొదల్లోకి దూసుకుపోయిన 108 వాహనం


108 వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ


నరేష్ మృతదేహం


గాయపడిన కోటేశ్వరరావు

కొల్లూరు : జోరు వానలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాల బారినపడిన సంఘటన కొల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం నిజాంపట్నానికి చెందిన 108 వాహనంలో రేపల్లె వైద్యశాల నుంచి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు రోగులను తరలిస్తున్నారు. వేమూరు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై కొల్లూరుకు ముగ్గురు యువకులు వస్తున్నారు. స్థానిక స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న షేక్ నరేష్, పాలపర్తి కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ హుటాహుటిన కొల్లూరు ఎస్ఐ, స్థానికులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన నరేష్ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కోటేశ్వరరావు పరిస్థితి కూడా విషమంగా ఉంది. ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనం పైనే ఉన్న మరో యువకుడు అక్షయ్ అభిజిత్ స్వల్ప గాయాలతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం కారణంగా 108 వాహనం అదుపుకోల్పోయి రోడ్డు పక్కనున్న ముళ్ల పొదల్లోకి దూసుకుపోయింది. డ్రైవర్ ముద్రబోయిన సుబ్బారావు పంట కాలువలోకి వాహనం పల్టీ కొట్టకుండా నిలువరించగలగడంతో రేపల్లె నుంచి తరలిస్తున్న రోగులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడగలిగారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. రోగులను మరో 108 వాహనంలో పోలీసులు తెనాలి వైద్యశాలకు తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఎస్ఐ జానకీ అమరవర్ధన్ తెలిపారు.

సమష్టి కృషితో డివిజన్‌లో అద్భుతమైన పురోగతి

రైల్వే డివిజన్ పీఆర్‌ఓ డి.వినయ్‌కాంత్

లక్ష్మీపురం: అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా గుంటూరు రైల్వే డివిజన్ అద్భుతమైన పురోగతి సాధిస్తోందని గుంటూరు రైల్వే డివిజన్ పీఆర్వో డి.వినయ్‌కాంత్ తెలిపారు. ఆదివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఈ ఏడాది సాధించిన విజయాలు, అభివృద్ధి వివరాలు వెల్లడించారు. 3.809 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయగా రూ.712 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గతేడాది కంటే 6.1 శాతం ఎక్కువని చెప్పారు. నడికుడి-శ్రీకాళహస్తి లైను 309 కిలోమీటర్లు కాగా ఇప్పటి వరకు 90 కి.మీ పూర్తయిందన్నారు. ఎర్రుబాలెం-నంబూరు (56.53 కి.మీ) లైను ఏపీ రాజధాని అమరావతిని కలుపుతుందని, భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. నల్లపాడు-నంద్యాల 12 కి.మీ పూర్తయిందని తెలిపారు. నవంబర్ 2025 నాటికి గురజాల-నంద్యాల పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబర్ 2026 నాటికి దిగువమెట్ట-గురజాల (40 కి.మీ) పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నల్లపాడు-పిడుగురాళ్ల 30 కి.మీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో 16 రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్‌ల పునరాభివృద్ధి కోసం రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు తెలియజేశారు.

కృష్ణా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కొల్లూరు : కృష్ణా నదీ వరద ప్రవాహంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చి, నది అంచుల వద్ద పొదల్లో తేలింది. ఆదివారం ఉదయం మండలంలోని ఈపూరులంకలో పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు నది ఒడ్డు వెంబడి 60 సంవత్సరాల వరకు ఉన్న ఓ పురుషుడి మృతదేహం తేలి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో రెవెన్యూ సిబ్బందితో కలసి అక్కడకు వెళ్లారు. రెండు రోజుల కిందట విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద నదిలోకి దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం అయి ఉండవచ్చన్న అనుమానంతో కొల్లూరు పోలీసులు తాడేపల్లి, విజయవాడ పోలీసులకు సమాచారం అందించారు. అయితే, మృతదేహం విజయవాడ వద్ద నదిలో దూకిన వ్యక్తిది కాదని అతని బంధువులు నిర్ధారించారు. నది ఒడ్డున పొదల్లో ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లభించలేదు. బట్టతలతో, లేత గోధుమ రంగు చొక్కా, బ్లూ ప్యాంట్ ధరించి, చేతికి ఎర్రని దారంతో ఆంజనేయ స్వామి లాకెట్ కట్టి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం శవాగారంలో భద్రపరచనున్నట్లు ఎస్ఐ జానకీ అమర్‌వర్ధన్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు చెప్పారు.

ఎస్సీ కాలనీలో పంచాయతీ రహదారి మూసివేత

నివాసితులను భయభ్రాంతులకు గురి చేస్తున్న గ్రామానికి చెందిన వ్యక్తి


పంచాయతీ రోడ్డుకు అడ్డంగా వేసిన సిమెంటు తూములు, ఇనుప కంచె పట్టించుకోని అధికారులు

చెరుకుపల్లి: అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి వందలాది మంది రాకపోకలు సాగించే పంచాయతీ రహదారిని ఆక్రమించి ఎస్సీ కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్న సంఘటన మండలంలోని కావూరులో జరిగింది. నివాసితుల వివరాల మేరకు.. ఎస్సీ కాలనీ నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు 50 సంవత్సరాల కిందట రోడ్డు ఏర్పాటు చేశారు. అనంతరం కాలనీ వాసుల సహకారంతో పంచాయతీకి రాశారు. విద్యుత్ స్తంభాలు, మంచినీటి కుళాయిలు కూడా పంచాయతీ అనుమతితోనే ఏర్పాటు చేశారు. ఇన్ని సౌకర్యాలతో రాకపోకలు సాగిస్తున్న ఈ రోడ్డును అదే గ్రామం కూటమి ప్రభుత్వానికి చెందిన కొల్లు సుధీర్ సిమెంటు తూములు, ఇనుప కంచె వేసి మూసి వేశాడని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్‌ప్లాన్ ప్రత్యేక గ్రాంటుతో రోడ్డు నిర్మాణం

మాజీ సర్పంచ్ నన్నపనేని వెంకటరావు మాట్లాడుతూ తాను గ్రామ సర్పంచ్‌గా ఉన్నప్పుడు సమయంలో 2010-11లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రత్యేక గ్రాంటు ద్వారా కొంత దూరం సీసీ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు. ఈ రోడ్డులో నూతన భవనాలు నిర్మించుకునే వారికి, నీటి కుళాయిలు, విద్యుత్ మీటర్లకు పంచాయతీ ద్వారానే ఇప్పటి వరకు అనుమతులు కొనసాగుతున్నాయని తెలిపారు. దౌర్జన్యంగా రోడ్డు ఆక్రమించిన వ్యక్తిపై పంచాయతీ అధికారులకు, స్థానిక పోలీసులు, రెవెన్యూ వారికి పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు. వందలాది మంది నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తూ, పంచాయతీకి అన్ని పన్నులు చెల్లిస్తున్నా రోడ్డుకు సంబంధించి అసలు రికార్డే లేకపోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ కుట్రే అని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా వేసిన సిమెంటు తూములు తొలగించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. రోడ్డు సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఎం. జోగేంద్ర కుమార్‌ను వివరణ కోరగా గ్రామానికి చెందిన కొల్లు సుధీర్ కోర్టును ఆశ్రయించాడని తెలిపాడు. ఈ రోడ్డుకు సంబంధించి అసలు ఏ రికారుర్డు పంచాయతీలో లేదని వివరణ ఇచ్చారు.

మద్యం మత్తులో వర్షపు నీటిలో పడి వ్యక్తి మృతి




లక్ష్మీపురం: మద్యం మత్తులో వర్షపు నీటిలో పడి వంట మాస్టర్ మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గుంటూరులోని ముత్యాలరెడ్డి నగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన చింతాబత్తిన కుమార్ బాబు (35) అరండల్‌పేట 10వ లైన్‌లోని మెస్‌లో వంట మాస్టర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య దుర్గాదేవి బొంగరాల బీడు యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తోంది. కుమార్ బాబు శనివారం అర్ధరాత్రి పూటుగా మద్యం తాగి డొంక రోడ్డు మూడు వంతెనల సెంటర్ వద్ద వర్షపు నీటిలో పడి మృతి చెందాడు. స్థానికులు భార్య దుర్గాదేవికి సమాచారం తెలియజేయడంతో హుటాహుటిన చేరుకుని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. దుర్గాదేవి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

25న విజయవాడలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల రక్షణపై ధర్నా


సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల నాయకులు

లక్ష్మీపురం: దళితులపై దాడులు, అత్యాచారాలు ఆగాలంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, లేకుంటే బాధితులకు న్యాయం జరగదని కుల వివక్ష వ్యతిరేక సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. దళితులు, బహుజనులపై జరుగుతున్న అత్యాచారాలు, అట్రాసిటీ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం , పోలీస్ వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ గుంటూరు బ్రాడీపేటలోని పీఎల్ రావు భవన్‌లోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై అణచివేత కొనసాగుతున్న పరిస్థితుల్లో బహుజన సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు వెంటనే కేసులు నమోదు చేయకపోవడం, ఆలస్యం చేయ డం, లేదా ఎఫ్ఐఆర్‌లు బలహీనంగా నమోదు చేయడం వల్ల న్యాయం జరగడం లేదని అన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ బాధితుల పక్షాన నిలబడే మానవ హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలను ప్రభుత్వం అడ్డుకోవడం మానుకోవాలన్నారు. న్యాయవాది శిఖా సురేష్ మాట్లాడుతూ కేసులను తేలికగా తీసుకుంటే న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుందన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించడమే సమాజంలో మార్పు తీసుకొస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. లక్ష్మణరావు మాట్లాడుతూ దళితులు గిరిజనుల మీద జరుగుతున్న దాడులకు నిరసనగా అన్ని దళిత గిరిజన సంఘాలతో పాటు వర్గ సంఘాలు కూడా తోడై ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 25న విజయవాడలో జరగబోయే ధర్నాలో పాల్గొని ప్రభుత్వాన్ని కదిలించేలా పోరాటం చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పులిచింతలకు 3,37,264 క్యూసెక్కులు విడుదల


సాగర్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి పులిచింతలకు విడుదలైన నీరు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 16 క్రస్ట్ గేట్లు ద్వారా 3,37,264 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 16 క్రస్ట్ గేట్లు నాలుగు మీటర్లు ఎత్తి 3,37,264 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 74.78 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటిసామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.593 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. రెండు విద్యుత్ యూనిట్ల ద్వారా ఉత్పాదన నిలిపివేసినట్లు వెల్లడించారు. టీఆర్‌సీ లెవల్ 62.43 మీటర్లకు చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి 3,09,545 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. సాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.